నేడు ప్రజావాణి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం 'ప్రజావాణి'కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉపకమిషనర్ డాక్టర్ రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సర్కిల్ పరిధిలోని ప్రజలు ఫిర్యాదులు అందించవచ్చన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ప్రజావాణిలో పాల్గొంటారని అక్కడికక్కడే సమస్య పరిష్కారానికి కృషి చేస్తారని వెల్లడించారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళి



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వాసవీ వెల్ఫేర్ నాయకులు

మణికొండ: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఆదివారం మణికొండలో ఘనంగా నిర్వహించారు. మణికొండ వాసవీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును తొలగించడం సబబు కాదన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు.

ఎమ్మార్పీఎస్ దీక్షకు బీఆర్ఎస్ సంఘీభావం



ఎమ్మార్పీఎస్ దీక్షకు సంఘీభావం తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

శంషాబాద్ రూరల్: మాదిగల రిజర్వేషన్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న మొండి వైఖరిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం శంషాబాద్ బస్టాండ్ వద్ద రిలే నిరాహార దీక్షను చేపట్టారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోహన్‌రావు దీక్షాస్థలికి చేరుకుని సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగల రిజర్వేషన్ల పట్ల దోబూచూలాడుతోందని విమర్శించారు. దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించకుండా కొన్ని వర్గాలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సతీష్, జయమ్మ, కె.శ్రీనివాస్, రాజేందర్, అశోక్, చెన్నకేశవులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నంబర్‌కు 'ఫోన్ నంబర్' లింక్ చేయండి

నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

మణికొండ: మున్సిపాలిటీలో ఆస్తులు ఉన్న వారు తమ ఇంటి నంబర్, పీటిన్ నంబర్లకు మీ ఫోన్ నంబర్‌ను లింక్ చేసుకోవాలని నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణమోహన్‌రెడ్డి కోరారు. అపుడు వారి ఆస్తుల వివరాలు, పన్నులు, చెల్లింపులు, బకాయిల వివరాలు ఎప్పటికపుడు మెసేజ్‌ల రూపంలో సమాచారం వస్తుందన్నారు. సీడీఎంఏ లింక్ ద్వారా లేదా మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించి లింక్ చేసుకోవాలని కోరారు.

వృద్ధుడి అదృశ్యం



మహ్మద్ చోటుమియా


అత్తాపూర్: టీ తాగేందుకు వెళ్లిన వృద్ధుడు కనిపించకుండా పోయిన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... హసన్‌నగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ చోటుమియా(61) ఫిబ్రవరి 11వ తేదీ ఉదయం 10గంటల ప్రాంతంలో స్థానికంగా ఉన్న హోటల్‌లో టీ తాగి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. సాయంత్రమైనా తిరిగి రాలేదు. దీంతో ఆచూకీ కోసం స్నేహితులు, బంధువులు వద్ద వాకబు చేసినా ప్రయోజనం లేకుండాపోయింది. దీంతో అతడి కుమారుడు మహమ్మద్ నజీర్ అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఎక్సైజ్ స్టేషన్‌లో వాహనాల వేలం

చందానగర్: శేరిలింగంపల్లి మండలం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్‌లో వివిధ కేసులలో పట్టుబడ్డ వాహనాలకు సోమవారం వేలం పాట నిర్వహిస్తున్నామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మండల పరిధిలో గంజాయి, సార సరఫరా చేస్తూ పట్టుబడ్డ 10 వాహనాలు ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణ ప్రియ ఆదేశాల మేరకు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 11 గంటల నుంచి వేలం పాట నిర్వహిస్తున్నామన్నారు.

పార్కులు, ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం..!

- కనుమరుగవుతున్న పెద్దతాళ్లకుంట చెరువు, పార్కు
- యథేచ్ఛగా బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలు



పెద్దతాళ్లకుంట చెరువు



పార్కు స్థలంలో ఇటుక, ఇసుకతో కూడిన వాహనాల పార్కింగ్





పార్కు స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణాలు

అత్తాపూర్: ఆక్రమణలకు గురవుతున్న పెద్ద తాళ్లకుంటను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. భూకబ్జాదారులు కనిపించిన కుంటలు, చెరువులు, ప్రభుత్వ స్థలాలను కాజేస్తూ నకిలీ డాక్యుమెంట్ల సహాయంతో రిజిస్ట్రేషన్లు చేసుకోవడం ఆపై అమాయక ప్రజలకు విక్రయిస్తూ కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్నారు. ప్రభుత్వంలో ప్రభుత్వ స్థలాలు, ఎఫ్‌టీఎల్ భూములు, మూసీనది తీర ప్రాంత కబ్జాలను గుర్తించడంతో పాటు హైడ్రా సహాయంతో ఆ భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటున్న విషయం తెలిసిందే. మరి ఈ భూములను కూడా స్వాధీనం చేసుకుంటుందా లేదా అనేది వేచి చూడాలి.

ఈ ప్రాంతాల్లోని స్థలాలు హాంఫట్.!

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని టీఎన్‌జీవోస్ కాలనీ, హౌజింగ్ బోర్డు కాలనీ, లక్ష్మీగూడలోని బుల్బుల్ కుంట, బాబుల్‌రెడ్డినగర్ ప్రాంతంలోని నర్సాబాయి కుంట, శివరాంపల్లి ఊర చెరువు, పయనీర్ స్కూల్ సమీపంలోని పార్కు కోసం వదిలిన 2వేల గజాల స్థలం, గగన్‌పహాడ్ అప్ప చెరువు తదితర ప్రాంతాలలో కోట్లాది రూపాయల స్థలాలు భూములు కబ్జాదారుల కబంధ హస్తలలోకి వెళ్లిపోయాయి. కబ్జాలకు గురైన కొన్ని స్థలాల్లో బహుళ అంతస్తుల నిర్మాణాలు, అపార్ట్‌మెంట్లు వెలిశాయి.

పెద్ద తాళ్లకుంటను ఇష్టానుసారంగా ఆక్రమించేశారు..

రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో హైడ్రా వచ్చాక కమిషనర్ రంగనాథన్ తనదైన శైలిలో ప్రభుత్వ ఆస్తులను కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ ఎలివేటెడ్ వే అత్తాపూర్ 162 పిల్లర్ నంబర్ ప్రధాన రహదారిలో ఉన్న పెద్ద తాళ్లకుంటను ఇష్టానుసారంగా ఆక్రమించేశారు. ఆక్రమణకు గురైన ప్రాంతాన్ని వదిలివేసి 2016 నగర మేయర్ బొంతు రామ్మోహన్ ఆధ్వర్యంలో అప్పటి ఐటీ మంత్రి కేటీఆర్ స్థానికుల అవసరాల మేరకు పార్కు అభివృద్ధి చేశారు. అభివృద్ధి చేసిన పార్కులో కొందరూ వ్యక్తులు పెద్ద ఎత్తున ఏసీ కన్వెన్షన్ హాల్ నిర్మించాలన్న దురుద్దేశంతో ఈ పార్కులో సగం స్థలం తమకే చెందుతుందని వాదనకు దిగారు.

ఆక్రమణదారులు అడ్డంకులు సృష్టించడంతో...

పెద్ద తాళ్లకుంటలో పూర్తిస్థాయిలో వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేసేందుకు ఆక్రమణదారులు అడ్డంకులు సృష్టించడంతో అధికారులు వెనుదిరిగారు. పూర్తిస్థాయిలో వాకింగ్ ట్రాక్‌ను నిర్మించడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కుకు వచ్చే వాకర్సు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

చెరువు వరకు ఉన్న సర్వీస్ రోడ్డును సైతం..

ఉప్పర్‌పల్లి చౌరస్తా నుంచి పెద్దతాళ్లకుంట చెరువు వరకు ఉన్న సర్వీస్ రోడ్డును ఆక్రమించిన కొందరు ఇసుక, ఇటుక, కంకర గ్రనేటు సరఫరా చేస్తున్న లారీలకు పార్కింగ్ స్థలాన్ని కేటాయించారు. అక్రమ పార్కింగ్‌లతో వచ్చిన సొమ్మును తమ బ్యాంకు ఖాతాల్లోకి వేసుకుంటున్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి..



ఉష్ణోగ్రతలు పెరగడంతో పెద్ద తాళ్లకుంట పార్కులోని మొక్కలు, చెట్లు ఎండిపోతున్నాయి. పార్కుకు ప్రత్యేకంగా రెండు కనెక్షన్లు ఇవ్వాలి. రోజుకు ఒక ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేయాలి. జీహెచ్ఎంసీ వారు ప్రత్యేకంగా నీటి వసతి ఏర్పాటు చేయాల్సి ఉంది. తాగుబోతులకు అడ్డాగా మారిపోతున్న ఈ పార్కులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.

– సుజాత, పార్కు నిర్వాహకురాలు

ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి..



రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయి. హైడ్రా పేరుతో హడావిడి చేసిన ప్రభుత్వం ఇక్కడ దృష్టి పెట్టడం లేదు. టీఎన్జీఓ కాలనీ పెద్ద మనుషులుచ ప్రజాప్రతినిధులు దొంగ డాక్యుమెంట్లను సృష్టించి పార్కుల స్థలాలను సైతం కబ్జా చేస్తున్నారు. ఇప్పటికే బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టి అమాయకులకు విక్రయించారు. ధర్నాలు చేస్తే పోరాటం చేసిన మాపై కేసులు పెట్టి జైలు పాలు చేశారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి.

– వనంపల్లి జైపాల్‌రెడ్డి, ఏఐటీయూసీ కార్యదర్శి

వదిలే ప్రసక్తే లేదు..

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో కబ్జాలకు గురైన ప్రభుత్వ స్థలాలను ఇప్పటికే గుర్తించాం. ప్రభుత్వ స్థలాలలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా వదిలే ప్రసక్తే లేదు. పార్కులు, కుంటలను కబ్జాదారుల నుంచి రక్షించి భావితరాలకు అందిస్తాం. భూముల జాగాలు క్రయవిక్రయాలలలో ఆచితూచి పరిశీలించి కొనుగోలు చేయాలి. మార్కెట్ కంటే తక్కువగా వస్తుందని కొని మోసపోవద్దు.

– బొమ్మ రాములు, రాజేంద్రనగర్ తహసీల్దార్

ప్రభుత్వ స్థలాల వైపు చూడకండి



పట్టణ ప్రజలు ఆహ్లాదకరంగా జీవించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. ఆక్రమణలకు గురైన నాలాలు, చెరువులు, కుంటలు ప్రభుత్వ స్థలాలను రక్షించుకునేందుకు ప్రభుత్వం హైడ్రాను తీసుకొచ్చింది. స్వార్థాన్ని వీడి ప్రభుత్వ స్థలాల వైపు చూడకండి. పార్కుల అభివృద్ధికి కృషి చేస్తున్న సంస్థలను దూషించొద్దు. చెరువు, కుంటలను కాపాడుకుందాం.

– రవికుమార్, రాజేంద్రనగర్ డీఎంసీ

సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవ్వాలి



ఆశ్రమంలో భోజనం అందజేస్తున్న మానవ సేవే మాధవ సేవా సంస్థ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: అనాథలు, వృద్ధులు, మానసిక దివ్యాంగులకు తోడ్పాటు అందిస్తూ వారికి అండగా నిలుస్తున్నామని మానవ సేవే మాధవ సేవా సంస్థ చైర్మన్ ఏర్వ కుమారస్వామి అన్నారు. ఆదివారం మేడిపల్లిలో గల అమ్మ ఆసరా ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి సహకరించిన ఆశ్రమ నిర్వాహకులు మేఘన్, విజయలక్ష్మి, శివలను సంస్థ ప్రతినిధులు సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్వ కుమారస్వామి మాట్లాడుతూ.. సమాజంలో సేవ చేయడం అందరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు కొంపల్లి జగదీష్, గొంత్యాల శ్రీనివాస్, దినేష్, హేమలత, లక్ష్మి, అనిత తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



రాఘవేందర్ యాదవ్

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైందని బీఆర్ఎస్ యువజన విభాగం డివిజన్ అధ్యక్షుడు అక్కెం రాఘవేందర్ యాదవ్ అన్నారు. శివాజీ చౌక్ సర్కిల్ వద్ద ఆదివారం కేటీఆర్, జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మలను కాంగ్రెస్ నాయకులు దహనం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు 15 నెలలు కావస్తున్న కూడా అభివృద్ధిపై దృష్టి సాధించకపోవడం సిగ్గుచేటన్నారు. సచివాలయం ప్రాంగణంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

• ఇఫ్తార్



రాజేంద్రనగర్‌లోని నవజ్యోతి యూత్ క్లబ్ ఆవరణలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మజ్లీస్ పార్టీ నాయకుడు ముర్తుజా అలీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రహమత్ బేగ్, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. – రాజేంద్రనగర్

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

రాజేంద్రనగర్: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ సూచించారు. రాజేంద్రనగర్ బుద్వేల్‌లో థైరోకేర్ డయాగ్నోస్టిక్ సెంటర్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... మారుతున్న జీవనశైలితో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ జీవనశైలికి అనుగుణంగా సరైన ఆహారం, నిద్ర తీసుకుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రావణ్, సాయి, దేవి, మధు తదితరులు పాల్గొన్నారు.



నార్సింగిలో జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసిన కాంగ్రెస్ నాయకులు



మణికొండలో దిష్టిబొమ్మను ఊరేగించి దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దళిత ద్రోహి.. ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

- మణికొండ, నార్సింగిలలో జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మల దహనం
- జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని డిమాండ్

మణికొండ: శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వాఖ్యలు చేయటమే దళిత జాతిని అవమానించేలా మాట్లాడిన మాజీ మంత్రి జగదీశ్ రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బి. జ్ఞానేశ్వర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపు మేరకు నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జగదీశ్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. సభాపతితోనే అమర్యాదగా మాట్లాడే సంస్కృతి బీఆర్ఎస్ పార్టీదేనని అన్నారు. ఇలాంటి నాయకులు చట్ట సభలలోకి వెళ్లేందుకు అనుర్హులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దశరథ్ యాదవ్, నాయకులు విజయ్‌బాబు, గండయ్య, ప్రవీణ్‌యాదవ్, డి.కిరణ్, పాపిరెడ్డి, యాదగిరి, శివపాల్‌సింగ్, అశోక్, రాము, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మణికొండ మర్రిచెట్టు కూడలిలో..

మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని మర్రిచెట్టు కూడలిలో పార్టీ అధ్యక్షుడు ఎం.జితేందర్ అధ్యక్షతన జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మను ఊరేగించి దహనం చేశారు. దళిత బిడ్డ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను అవమానించిన జగదీశ్‌రెడ్డిపై చట్టరీత్యా చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కస్తూరి సతీష్, కార్యదర్శి అఖిల్, మాజీ కౌన్సిలర్లు కె.లక్ష్మీనారాయణ, డి.పురుషోత్తం, నాయకులు యాలాల నరేష్, తాజుద్దీన్, బి.రాజు,బి.శ్రీరాములు, బాల్‌రెడ్డి, ప్రభావతి, రాజు, రమేష్, శివానందరెడ్డి, విఠల్‌రెడ్డి, శివగంగ తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు..

రాజేంద్రనగర్: శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని వెంటనే బీఆర్ఎస్ పార్టీ సస్పెండ్ చేయాలని రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మను డెయిరీ ఫామ్ సర్కిల్ వద్ద దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శాసనసభ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోరని బాల్‌రాజ్, శ్రీకాంత్, భరత్‌సాయి, రఫిక్, ప్రవీణ్, శ్రీను, మనోహర్, మధు, అక్బర్, బంటి పాల్గొన్నారు.

శంషాబాద్ బస్టాండ్ వద్ద నిరసనలు..

శంషాబాద్‌రూరల్: స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం శంషాబాద్ బస్టాండ్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్ రెడ్డి, కేటీఆర్ దిష్టిబొమ్మలను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు సంజయ్‌యాదవ్, మండల అధ్యక్షుడు శేఖర్‌యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు జల్‌పల్లి నరేందర్, నాయకులు సులోచన, నజీరుద్దీన్, పరమేష్, అక్రమ్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



డెయిరీ ఫామ్ సర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు



శంషాబాద్ బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

వైభవంగా పోచమ్మ ఆలయ వార్షికోత్సవం



పద్మశాలిపురంలోని పోచమ్మ తల్లి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పద్మశాలిపురంలోని పోచమ్మ తల్లి ఆలయ 7వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని వివిధ రకాల పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ టి.ప్రేమ్‌దాస్‌గౌడ్, డివిజన్ అధ్యక్షులు ధనుంజయ్, సీనియర్ నాయకులు టి.ప్రేమ్‌గౌడ్, కాశీగారి యాదగిరి, మునుగపాటి వెంకటేష్, రుద్ర, శివ, బాలస్వామి, వెంకటేష్, వై.రాజు, సీతారామ్, మహిపాల్, పోశెట్టి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మత్తు మందు విక్రయిస్తున్న యువకుడి అరెస్టు

శంషాబాద్ రూరల్: పట్టణంలోని ఆర్బీనగర్ కాలనీలో మత్తు మందు విక్రయిస్తున్న యువకుడిని శనివారం రాత్రి ఎస్‌ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహారాష్ట్రకు చెందిన అభిషేక్ సంజయ్ తోటర్(24) డ్రగ్స్ తీసుకోవడంతో పాటు విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ పోలీసులు నిఘా వేశారు. గణేష్ థియేటర్ వద్ద అతడిని పట్టుకుని తనిఖీ చేశారు. 13 గ్రాముల ఎండీఎం మత్తు మందు లభించింది. దీని విలువ రూ.1.80 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఆర్జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.